క్లుప్తంగా

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ మోర్చ నాయకులు

మల్కాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి దివంగత రమాబాయి జయంతిని 59వ వార్డు శాంతిగిరికాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయబాబు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన పోరాటాలను వివరించారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎర్రయ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీనివాసనగర్ ప్రాంతానికి చెందిన ఇచ్ఛాపురం ఎర్రయ్య జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎర్రయ్య క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈ ప్రాంత నేతలు అభినందనలు తెలిపారు.

కొనసాగిన పెన్షనర్ల నిరసన



మాట్లాడుతున్న నాయకులు

విశాఖ విద్య: ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్రిపాలెం పీఎఫ్ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన నాలుగో రోజు గురువారం కూడా కొనసాగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధీనబంధు, కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. నెలకు కనీసం రూ.1000 కూడా రాని పెన్షనర్లు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించాలని కోరారు. మినిమమ్ పెన్షన్ మంజూరయ్యేలా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం. కృష్ణారావు, బి. సత్యనారాయణ, బి. నాగేశ్వరరావు, మూర్తి, అప్పలరాజు, సూర్యప్రకాషరావు, కుమార్‌తో పాటు స్టీల్ ప్లాంట్ పెన్షర్లు పాల్గొన్నారు.

అందుబాటులోకి నింబస్ యాప్ సేవలు



నింబస్ సేవలు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఈ-రిసోర్సెస్‌ని విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కొత్తగా నింబస్ ఎం లైబ్రరీ మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నింబస్ యాప్ సేవలను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. విభిన్న డిజిటల్ రిసోర్సెస్‌ను విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు ఉపయుక్తంగా నిలిపేలా ఈ సేవలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టళ్లలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఆచార్య వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్య రక్ష

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- 352 మందికి వైద్య సేవలు



రోగి సమస్య తెలుసుకుంటున్న వైద్యుడు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రోగులు

గోపాలపట్నం: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. వైద్య సిబ్బంది ముందస్తుగానే ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమాచారం అందించడంతో శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో యల్లపువానిపాలెం హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. చంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యుడు వికాస్ శిబిరాన్ని పర్యవేక్షించారు. స్త్రీ వైద్య, కంటి, ఈఎన్‌టీ, జనరల్ ఫిజీషియన్ వైద్యనిపుణులు వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు దగ్గరుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు బీపీ, సుగర్ వంటిపరీక్షలు చేశారు. శిబిరంలో మొత్తంగా 352 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. షుగర్, బీపీ ఉన్నవారు ఎక్కువగా వచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరికి టీబీ సోకినట్టు గుర్తించారు. వీరికి క్షయ విభాగం సిబ్బంది మందులు అందించారు. వీరిని ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని సిబ్బంది తెలిపారు. శిబిరానికి వచ్చిన వారు సేవలపై సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం నిర్మించి అందుబాటులోకి వైద్య తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటామని చెబుతున్నారు. వైద్యాధికారి వికాస్ మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని తెలిపారు. శిబిరంలో సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కూడా ఉంటుందని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బాబా



సాయి సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాలతో అభిషేకం జరిపించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. సాయంత్రం బాబాకు పంచ హారతులు ఇచ్చారు. భక్తులంతా సామూహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. మంత్రపుష్పం జపించారు. ప్రత్యేక హారతి ఇచ్చిన తర్వాత బాబా మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్ల సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

చురుగ్గా కాల్వ నిర్మాణ పనులు



రెడ్డి వీధిలో చేస్తున్న కాల్వ పనులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు చిన్న బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధిలో కాల్వ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో శిథిలమైన పలు కాల్వలను జీవీఎంసీ అధికారులు పునరుద్ధరిస్తున్నారు. సుమారు రూ.17 లక్షలతో ఈ పనులు చేపట్టారు. నిధులు మంజూరు చేయించినందుకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ ఆన్‌లైన్ తరగతులు

పశ్చిమ సమన్వయకర్త ఆడారి సొంత నిధులతో నిర్వహణ



స్పోకెన్ ఇంగ్లిష్ ఆన్‌లైన్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్టు 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి యువతకు క్లాసులపై అవగాహన కల్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో స్పోకెన్ ఇంగ్లిష్‌లో 30 సంవత్సరాల అనుభవం ఉన్న డాక్టర్ మేడారం చిరంజీవి పర్యవేక్షణలో ఆన్‌లైన్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతను ప్రోత్సహిస్తూ జాబ్ మేళా, క్రీడాస్ఫూర్తి పెంపొందించే విధంగా క్రికెట్ టోర్నమెంట్‌లు, ఆడపడుచులను అన్నగా ఆదుకోవడంతో పాటు వృద్ధులకు పెద్దదిక్కుగా మారి ఆనంద్‌కుమార్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఆయన్ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తి చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకుడు చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విభాగం ప్రగతి సాధించాలి



బీవోఎస్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతీవిభాగం ప్రగతిలో భాగం కావాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభాగంలో ఆచార్యులు సాధించిన అవార్డులు, పేటెంట్లు, వారు పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులు వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఒక ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇలా చేస్తే విభాగ స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒక డాక్యుమెంట్ రూపంలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం నాక్ సన్నద్ధత జరుగుతుందన్నారు. ఏడేళ్ల తరువాత నాక్ స్కోర్ కనీసం 3.8 గ్రేడ్ పాయింట్ల కంటే అధికంగా సాధించే లక్ష్యంతో విభాగాలలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలో ఏటా ఇంటర్నల్ ఆడిట్ చేయడం, నాక్‌కు సమాచారాన్ని సిద్ధం చేయడం ఎంతో ప్రధానమన్నారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించి, సూచనలు స్వీకరిస్తూ, నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు, బీవోఎస్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

సైన్స్‌తో దేశానికి ఎంతో మేలు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

మధురవాడ: సైన్స్ దేశానికి ఎంతో మేలు చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైన్స్ కళా బస్ యాత్ర గురువారం ఉదయం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సైన్స్ ప్రాముఖ్యత, దానివల్ల కలిగే ప్రయోజనాలు వివరించేందుకు ఈ కళాజాత ప్రారంభించినట్టు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించడానికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి పెంచుకుని, సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కళాకారులు సైన్స్‌పై ప్రదర్శించిన నాటికలు, నృత్య రూపకాలు, గీతాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బోర అప్పలరెడ్డి, నాయకులు శేషగిరిరావు, శ్రీకాంత్, రమణబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవాలని వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సహకరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కోరారు. గురువారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం 66 గ్రామాలకు చెందిన ప్రజలు తమ భూములు కోల్పోయారన్నారు. సొంత గనులు కేటాయించకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి వివిధ పన్నులు, లాభాల రూపేణా రూ.55 వేల కోట్లు తిరిగి చెల్లించిందన్నారు. మరోవైపు సెయిల్‌ను విస్తరించడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు చేయడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అంతా కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మధురవాడ వాంబేకాలనీ సునీల్ శర్మకాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పద్ధతులు ఉపయోగించి విద్యార్థులకు మరింత చక్కగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం పెంచాలని, పాఠాలు వీక్షించాలన్నారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కూరమాన గీతాదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థల సేకరణకు సహకరించండి

పాతగోపాలపట్నం వాసులతో బెహరా



స్థానికులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గురువారం పర్యటించారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా ఇక్కడి వరద నీటి కాల్వ సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అయితే కాల్వ నిర్మాణానికి స్థల సేకరణ చేయాల్సి ఉన్నందున స్థానికులతో మాట్లాడారు. స్థల సేకరణ విషయంలో గ్రామస్తులు సహకరించాలని, ఏకాభిప్రాయంతో ముందుకు వస్తే కాలువ నిర్మాణం సజావుగా సాగుతుందని తెలిపారు. అందరి ప్రయోజనాల కోసం చేస్తున్న పనికి గ్రామస్తుల సహకారం కావాలన్నారు. ఆయన వెంట ఏఈ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు,నాయకులు పొట్నూరి శంకరరావు, బల్లంకి వెంకటరావు, పీఎస్ రాజు, పసుపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల స్పీడ్‌కు బ్రేక్‌లు పడాల్సిందే



వాహనం ఢీకొట్టడంతో..



ఒంగిపోయిన నో ఎంట్రీ బారియర్

విశాఖ విద్య: ఎన్ఏడీ ప్రాంతంలో వాహనాల వేగానికి నియంత్రణ లేకుండా పోతుంది. భారీ వాహనాలు, ప్రధానంగా లారీల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఈ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి బిర్లా జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన బూత్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఇది పూర్తిగా ఒకవైపు వాలిపోయింది. రాత్రి సమయంలో కావడంతో ప్రాణ నష్టం తప్పినట్లైంది. ఇదే రీతిన పెందుర్తి నుంచి ఎన్ఏడీ వైపు వచ్చే బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీ వాహనాలు ఫ్లై ఓవర్ కిందకు రాకుండా ఏర్పాటు చేసిన నో ఎంట్రీ బారియర్‌ను సైతం ఓ వాహనం ఢీ కొట్టడంతో అది పూర్తిగా వంగిపోయింది. దానికి సపోర్ట్‌గా పెట్టిన ఫిల్లర్‌తో ప్రస్తుతం నిలబడి ఉంది. ఇది ఎప్పుడు కింద పడుతుందోనని అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. హై స్పీడుతో వచ్చే ఇలాంటి వాహనాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల అందజేత



గ్యాస్ కనెక్షన్లు అందుకున్న లబ్ధిదారులతో రమేష్

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరిట కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముద్ర రుణాలు, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి, జీవన సురక్ష పథకాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉజ్వల పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జీసీ నాయుడు, పాలిమేర శ్రీనివాసరావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నాడు నిర్లక్ష్యం.. నేడు వేగవంతం

- టీడీపీ హయాంలో నిలిచిపోయిన కాపు కల్యాణ మండపం పనులు
- ప్రస్తుతం చకచకా నిర్మాణ పనులు



టీడీపీ హయాంలో కల్యాణ మండపం ప్రతిపాదిత స్థలంలో పెరిగిన తుప్పలు



శరవేగంగా జరుగుతున్న కాపు కల్యాణ మంపడం పనులు

గోపాలపట్నం: గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కాపు కల్యాణ మండపం పనులు నేడు చురుగ్గా కొనసాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేసింది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో గోపాలపట్నం పరిసర ప్రాంతాల కాపు సంఘం సభ్యులు టీడీపీ ప్రభుత్వంలో కాపు కల్యాణ మండపం నిర్మించాలని ఎన్నోమార్లు వేడుకున్నారు. దీంతో ఒక అంతస్తుతో నిర్మించేందుకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే పునాదుల స్థాయిలో నిర్మాణం వరకు వచ్చిన తర్వాత కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేయలేదు. సుమారు రూ. 17 లక్షల వరకు నిధులు ఇవ్వకపోవడంతో మధ్యలో వదిలేశాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఈ నిర్మాణం పిచ్చి మొక్కలతో నిండి పోయింది.

వైఎస్సార్‌సీపీ రావడంతో కదలిక


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరుగున పడిన కాపు కల్యాణ మండపం విషయం తెరమీదకు వచ్చింది. దీంతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెండు అంతస్తుల భవనం నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఈ ప్రాంత కాపు సంఘ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేసే పనిపై చిత్త శుద్ధి ఉంటే అది సక్రమంగా నెరవేరుతుందని, ఆ చిత్త శుద్ధి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చూస్తున్నామని కాపు సంఘ నేతలు చెబుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్,సైకిల్ దగ్ధం
- చెలరేగిన మంటలు



అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో చెలరేగుతున్న మంటలు



దగ్ధమైన ఎలక్ట్రికల్ బైక్, సైకిల్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్‌లోని అపూర్వ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. అపూర్వ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వ్యక్తి తన ఎలక్ట్రికల్ బైక్‌కు చార్జింగ్ పెట్టి సొంత పనిమీద బయటకు వెళ్లాడు. సాయంత్రం 7.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ద్విచక్రవాహనం నుంచి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న విద్యుత్ ప్యానల్ బోర్డుతో పాటు సోఫాకు మంటలు అంటుకోవడంతో భారీగా చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు, అపార్ట్ మెంట్ వాసులు అప్రమత్తమయ్యారు. బైక్ సమీపంలో ఉన్న పలు ద్విచక్రవాహనాలను పక్కకు తొలగించారు. ఇంతలో సమాచారమందుకున్న మర్రిపాలెం ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంతో పాటు అపార్ట్‌మెంట్ విద్యుత్ ప్యానల్ బోర్డు, వాచ్‌మెన్‌కు సంబంధించిన సోఫా, సైకిల్ దగ్ధమయ్యాయి. ద్విచక్రవాహనాలను తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మర్రిపాలెం ఫైర్ అధికారి కేవీటీ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని తెలిపారు.